# సాక్షి పల్నాడు

బుధవారం। 4। డిసెంబర్। 2024






## జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఎమ్మెల్యే భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: అభివృద్ధి పనులపై నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మంగళవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో చర్చించారు.



## బాబు రాజేంద్రప్రసాద్‌కు నివాళి

నరసరావుపేట రూరల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం, బాబు రాజేంద్ర ప్రసాద్ జయంత్యుత్సవాన్ని కేసానుపల్లి జవహర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు.



## పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు

బొల్లాపల్లి: రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సమష్టి దివ్య పూజా బలి నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### ఫిరంగిపురంలో 17.8 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 17.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 1.2 మి.మీ. పడింది. సగటు 5.2 మి.మీ.గా నమోదైంది. మండలాలవారీగా ప్రత్తిపాడులో 16.4, కాకుమాను 15.4, పొన్నూరు 9.6, గుంటూరు పశ్చిమ 9.4, గుంటూరు తూర్పు 8.2, పెదనందిపాడు 7.4, చేబ్రోలు 5.2, మేడికొండూరు 2.2, పెదకాకాని మండలంలో 1.6 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది.

### సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 150 , తూర్పు కెనాల్‌కు 45 , పశ్చిమ కెనాల్‌కు 80, నిజాంపట్నం కాలువకు 278 , కొమ్మమూరు కాలువకు 1293 క్యూసెక్కులు వదిలారు.

### యార్డుకు 42,929 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 42,929 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 40,893 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 39,454 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

### నేడు నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం

బాపట్ల: వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం బుధవారం బాపట్లలో నిర్వహిస్తునట్లు జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కోన చాంబర్‌లో ఈ సమావేశం ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లా కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

### వెట్టి చాకిరి నుంచి కార్మికులకు విముక్తి



నగరంపాలెం: ఊరు కాని ఊరు.. తెలియని భాషతో వెట్టిచాకిరి చేస్తున్న వలస కార్మికులు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చొరవతో ఎట్టకేలకు స్వస్థలాలకు చేరుకున్నారు. క్షేమంగా గుంటూరు చేరిన వారు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలు క్రితం గుంటూరు నగరంలోని శివనాగరాజు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, మిర్చియార్డు ప్రాంతాల్లోని పది మందికి పైగా కార్మికులు తాపీ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఆ పనులు ముగిశాక మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని గెవ్రాయ్ గ్రామం చేరుకున్నారు. అక్కడ యజమాని డ్రైనేజీ పనులు చేయిస్తున్నాడు. తగిన వసతి కల్పించకుండా అర్ధాకలితో పనులు చేయించాడు. పారిపోయేందుకు ప్రయత్నించే వారిని కొట్టేవారు. ఎట్టకేలకు వారిలో ఒకరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో జిల్లా ఎస్పీ దృష్టికి విషయం చేరింది. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా బృందం బాధితులను తీసుకొచ్చింది. రూ.93 వేల వేతనాన్ని కూడా యాజమాని నుంచి ఇప్పించారు. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# గంజాయి గరళం

చిలకలూరిపేటకు చెందిన ఓ యువకుడు బీటెక్ మూడో ఏడాది చదువుతుండగా తోటి విద్యార్థుల ద్వారా గంజాయికి సరదాగా అలవాటు పడ్డాడు. ఆ తర్వాత వ్యసనపరుడై గంజాయి కోసం ఇంట్లో దొంగతనాలు చేయడంతోపాటు ఏకంగా అర్ధరాత్రి స్నేహితులతో కలిసి దారిదోపిడీలకు పాల్పడ్డాడు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న అతని తల్లిదండ్రులు గంజాయి మాన్పించడానికి విజయవాడలోని ఓ డీ అడిక్షన్ సెంటర్‌లో కొన్ని రోజులు ఉంచారు. మత్తు లేకుండా ఉండలేకపోయిన ఆ యువకుడు వారం తర్వాత డీ అడిక్షన్ సెంటర్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని మరణించాడు. ఇలా అనేక మంది జీవితాలు గంజాయి వల్ల నాశనమైపోతున్నాయి. ఇప్పటి వరకు సిగరెట్లు, లిక్విడ్ రూపంలోనే లభ్యమవుతున్న గంజాయి తాజాగా చాక్లెట్ల రూపంలోనూ లభించడం గగుర్పాటుకు గురిచేస్తోంది. ఈ విష సంస్కృతి ఇంకా ఎందరి ప్రాణాలు బలి తీసుకుంటుందో మరి..



- చాక్లెట్ రూపంలోనూ అమ్మకాలు
- ప్రభుత్వ వైఫల్యంతో విస్తరిస్తున్న విష సంస్కృతి
- కోటప్పకొండ సమీపంలో 400 గంజాయి చాక్లెట్ల స్వాధీనం
- పాఠశాల, కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా విజృంభిస్తున్న ముఠాలు
- గత ప్రభుత్వంలో ఎస్ఈబీ ద్వారా మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం
- ఎస్ఈబీకి మంగళం పాడిన కూటమి ప్రభుత్వం



ఎక్సైజ్ పోలీసుల దాడిలో సోమవారం పట్టుబడ్డ గంజాయి చాక్లెట్లు

సాక్షి, నరసరావుపేట: గంజాయి కేటుగాళ్లు రూటు మార్చారు. ఇప్పటివరకు లిక్విడ్, పొడి, సిగరెట్ల రూపాల్లోనే అమ్మిన వారు తాజాగా విద్యార్థులు తినే చాక్లెట్ల రూపంలోనూ గంజాయిని అందుబాటులోకి తెచ్చారు. విస్తుగొలిపే ఈ నిజం సోమవారం పోలీసుల తనిఖీల్లో బట్టబయలైంది. నరసరావుపేట శివారు కోటప్పకొండ సమీపంలో 400 గంజాయి చాకెట్లు లభ్యం కావడం తీవ్ర కలకలం రేపింది. గంజాయి సంస్కృతి చాప కింద నీరులా జిల్లాలో ఎలా విస్తరిస్తోందో కళ్లకకు కట్టింది. అచ్చు చిన్నపిల్లలు తినే చాక్లెట్‌లా ఉండే దీనికి ఒకసారి ట్రై చేద్దామని రుచి మరిగిన యువత బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని సమాచారం.

**విచ్చలవిడిగా అమ్మకాలు**

నరసరావుపేట గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారింది. అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 24న నరసరావుపేట టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించి 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు విక్రేతలను అరెస్ట్ చేశారు. పట్టణంలో ఇంత పెద్దమొత్తంలో గంజాయి దొరకడంతో ఒక్కసారిగా పోలీసులు ఉలిక్కిపడ్డారు. అక్టోబర్ 19న నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 మంది గంజాయి విక్రేతల నుంచి ఏడు కిలోల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి రవాణాలో ఎక్కువ మంది యువత ఉన్నారు. వీరు గంజాయి కొనడానికి డబ్బుల్లేక ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. గంజాయికి బానిసలై కొందరు చదువులనూ అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు.

**మూలాలపై దృష్టేది?**

గంజాయి విక్రేతలు పట్టుబడిన సందర్భంలో పోలీసులు మూలాలపై దృష్టిపెట్టడం లేదన్న వాదన ఉంది. ఫలితంగా నిందితులు వారం రోజులకే బెయిల్‌పై విడుదలై యథావిధిగా నేరాలకు పాల్పడుతున్నారు. గంజాయి అమ్మకాల వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారుతున్నట్టు విమర్శలున్నాయి. గంజాయి వ్యాపారులకు అధికారపార్టీ అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. ఎక్కడైనా గంజాయితో పట్టుబడితే వెంటనే నిందితుడు తమవాడేనంటూ రాజకీయ నేతలు స్టేషన్ ముందు వాలిపోతున్నట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు కొన్ని కేసులను దరాప్తు చేయకుండా వదిలేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

### ఎస్ఈబీ నిర్వీర్యం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టడంలో విజయం సాధించింది. సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా జరగకుండా కట్టడి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్ శాఖలో విలీనం చేసింది. చెక్‌పోస్టులు, ప్రత్యేక టీంలు లేకపోవడంతో మాదక ద్రవ్యాల రవాణాకు గేట్లు తెరిచినట్టయింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం గమనించిన కూటమి ప్రభుత్వం నష్టనివారణ చర్యలలో భాగంగా ఈగల్ పేరిట ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.

### నిరంతర నిఘా



మాదకద్రవ్యాల రవాణా కట్టడికి స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తాం. పాఠశాల, కళాశాల విద్యార్థులు గంజాయి బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి సమాచారం తెలిసిన వారు మా దృష్టికి తీసుకురావాలి. నిరంతర నిఘా ఉంటుంది.

– మణికంఠ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, పల్నాడు జిల్లా

### ఆయుర్వేదం ముసుగులో..



గంజాయి విక్రేతలు కొత్త పంథాలు అనుసరిస్తున్నారు. ఆయుర్వేద చాక్లెట్లుగా పేర్కొంటూ గంజాయి చాక్లెట్లను బడ్డీ కొట్లలో యథేచ్ఛగా అమ్ముతున్నారు. సెవన్ మినార్ పేరిట ఉన్న ఈ చాక్లెట్లను కొన్నినెలలుగా పాన్ షాపుల్లో అమ్ముతున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇంకా ఇతర ఏ పేర్లతోనైనా గంజాయి చాక్లెట్లు మార్కెట్‌లో అమ్ముతున్నారా? అనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రోలెన్ పేపర్ సాయంతో గంజాయిని కేటుగాళ్లు సిగరెట్ రూపంలో మార్చి ఇంజినీరింగ్ విద్యార్థులకు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం ఈ రోలెన్ పేపర్‌ను కేవలం బుక్‌స్టాళ్లలోనే అమ్మాలి. అయితే ప్రస్తుతం బడ్డీ కొట్లలోనూ రోలెన్ పేపర్ అమ్ముతుండడం విస్మయపరుస్తోంది.

### మాదకద్రవ్యాలతో పెనుముప్పు

**ఈగల్ టీం డైరెక్టర్ రవికృష్ణ**



నరసరావుపేటటౌన్: మాదకద్రవ్యాలు సమాజాన్ని అంతర్గతంగా బలహీనపరుస్తున్నాయని, వాటిపై 1972 నంబర్‌కు సమాచారం అందించాలని ఈగల్ టీం డైరెక్టర్ ఆకే రవికృష్ణ తెలిపారు. నరసరావుపేటకు మంగళవారం వచ్చిన ఆయన స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నరసరావుపేట సమీపంలోని ఈటీ గ్రామం వద్ద 400 గంజాయి చాక్లెట్లను సోమవారం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులను అభినందించారు. ఈ చాక్లెట్ల మూలాలపై విచారణ చేస్తున్నామన్నారు. పోలీస్, ఎక్సైజ్, ఈగల్ టీంలు సంయుక్తంగా సమావేశం నిర్వహించి గంజాయి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించామన్నారు. వైజాగ్ టూటౌన్ పరిధిలో ఒక కేసు, ఎక్సైజ్ పోలీసులు పలు ప్రాంతాల్లో మూడు కేసులు గంజాయిపై నమోదు చేశారన్నారు. మాదకద్రవ్యాలపై టోల్ ఫ్రీ నంబరు 1972కు ఫిర్యాదు చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. సమావేశంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీసీ కె.శ్రీనివాస్, ఏసీ రవికుమార్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ ఏసీ సుధాకర్ రెడ్డి, ఈఎస్ మణికంఠ, ఏఈఎస్ రవీంద్ర, సీఐ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## 7న ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్–టీచర్స్ మీటింగ్



కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా ఈనెల ఏడున అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయాలకు అతీతంగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ (పీటీఎం)నిర్వహించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించే కార్యక్రమానికి పూర్వవిద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలను ఆహ్వానించాలన్నారు. ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణం కనిపించాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కేవలం ఆహ్వానితులుగా మాత్రమే హాజరవుతారన్నారు. పాఠశాల ఆవరణంలో ప్రజాప్రతినిధుల బ్యానర్లు, ఎటువంటి రాజకీయ ప్రసంగాలకు తావులేదనే విషయం ప్రజాప్రతినిధులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డులు అందించాలని, వారి తల్లిదండ్రులకు తప్పనిసరిగా పిల్లల ప్రోగ్రెస్ గురించి వివరించాలన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు, సలహాలు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సంబంధ విషయాలపై తల్లిదండ్రుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం సమయానికి సమావేశం ముగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## పులిచింతల వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్



ఆక్టోప్ టీంతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి

అచ్చంపేట: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు ప్రాంతం పులిచింతల ప్రాజెక్టు వద్ద ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్(ఆక్టోపస్) అధికారులు మంగళవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, విధులు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అడిషనల్ ఎస్పీ ఎ.రాజారెడ్డి టీం సభ్యులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ముందుగా మాదిపాడులోని జెడ్పీ హైస్కూలులో టీమ్ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం పులిచింతల ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద సంస్థలు దాడులు నిర్వహించినప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తులను, కట్టడాలను ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మందికిపైగా టీమ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ ఎ.ఎస్.రంగబాబు, ఆర్ఐస్ శ్రీకాంత్, శివప్రసాద్, రామచంద్రానాయక్, ఇరిగేషన్ ఏఈ, మెడికల్, రెవెన్యూ సిబ్బంది, అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోడి పోరు.. జన హోరు

- రణక్షేత్రంలో ఉత్సాహం
- కొనసాగుతున్న వీరారాధన ఉత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, వెలిగండ్ల రాము



కోడి పుంజులను పోటీకి వదులుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే రాము

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రధానమైన కోడిపోరు మంగళవారం జరిగింది. తెల్లవారు జామున వీరుల గుడిలో పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, వీరాచారులు కోడిపోరును ప్రదర్శించారు. ముందుగా వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేశారు. అలనాడు బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మల మధ్య జరిగిన కోడిపోరు తీరును వర్ణించారు. కథాగానం మధ్యనే పీఠాధిపతి చెన్నకేశవ బ్రహ్మనాయుడు పుంజు చిట్టిమల్లును, వీరాచార యువతి నాయకురాలు పుంజు శివంగిడేగను పోటీకి వదిలారు. తొలి రెండు పందేలలో బ్రహ్మనాయుడు పుంజు చేతిలో నాగమ్మ శివంగిడేగ ఓడిందని ప్రకటించారు. అనంతరం మలి పందేనికి నాయకురాలు ఉసికొల్పుతుందని, మాచర్ల, గురజాల రాజులు మలిదేవుడు, నలగామరాజులూ సై అంటారని వీరవిద్యావంతులు వివరించారు. ఓడినవారు రాజ్యం వదలి ఏడేళ్లు అరణ్యవాసం చేయాలనే షరతుతో ఈ మలి పందెం జరుగుతుందని, ఆ పందెంలో నాయకురాలు మాయోపాయంతో గెలుస్తుందని, పందేలకు అలరాజు న్యాయనిర్ణేతగా వ్యవహరించారని కథకులు పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు పందెంలో ఓడారని అలరాజు ప్రకటించడంతో మలిదేవరాజు పరివారం ఏడేళ్లు అరణ్యవాసానికి తరలారని పేర్కొన్నారు.

**వేడుకగా కోడిపోరు**

ఆ తర్వాత కోడిపోరును వేడుకగా ప్రజల సమక్షంలో ఎమ్మెల్యేలు నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి బ్రహ్మనాయుడు పుంజుతో, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకురాలు పుంజుతో పందేలు వేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



కోడిపోరులో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

**వీరుల దీవెనలందుకున్న ప్రజలు**

ఇదిలా ఉంటే కోడిపోరు నాడు ప్రజలు భారీగా తరలివచ్చి వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలను దర్శించుకున్నారు. గ్రామోత్సవానికి వచ్చిన వీరుల ఆయుధాల ఆశీస్సులను ప్రజలు పొందారు. చిన్నారులకూ వీరుల దీవెనలందించారు. ఇదిలా ఉంటే వీరాచారులు పొంగళ్లు చేసుకుని తమ తమ కొణతాలతో ఊరేగింపుగా తరలివెళ్లి చెన్నకేశవస్వామికి అంకాలమ్మకు భారీగా బోనాలు సమర్పించారు. వీరాచారులు చాలా మంది గంగధారి మడుగు ఒడ్డున తలనీలాలు సమర్పించారు. చాలా మంది ఆచారవంతులు ఈ రోజు కూడా రణక్షేత్రానికి తరలివచ్చి తమ ఆచారాన్ని నెరవేర్చుకున్నారు. ఎక్కడ చూసినా కోడి పుంజులు, గొర్రె పొట్టేళ్లు కనిపించాయి. మధ్యాహ్నం వర్షం పడడంతో వీరాచారులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం జరగనున్న కళ్లిపాడు ఘట్టంతో ఐదు రోజుల ఉత్సవాలు ముగియనున్నాయి. పల్నాటి వీరుల ఆయుధాలు ఉదయం గ్రామోత్సవం ముగించుకుని ప్రజల ఆశీస్సులు పొంది సాయంత్రం నాగులేరు ఒడ్డున అలంకారాలు తీసివేసి కళ్లిపోతురాజు మండపం వద్ద కళ్లికి ఓరగడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

## మన ‘దీక్ష’.. మెరిసింది!

- క్రికెట్‌లో సత్తా చాటుతున్న గుంటూరు బాలిక
- బీసీసీఐ అండర్–15 టోర్నీతో వెలుగులోకి ప్రతిభ
- తల్లిదండ్రుల ప్రోత్సాహానికి తోడు కష్టపడేతత్వంతో రాణింపు



దీక్షను అభినందిస్తున్న ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): కొంచెం ఊహ వచ్చిన తర్వాత పిల్లలతో తల్లిదండ్రులు గడిపే సమయం కాలక్రమేణా తగ్గిపోతుంది. అందుకే వారు స్నేహితులపైనా, సెల్‌ఫోన్స్‌లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌పై ఎక్కువ ఆధారపడుతుండడం మనం తరచూ చూస్తుంటాం. పిల్లలకు విషయాలు తెలుస్తున్న సమయంలో వారితో ఎక్కువ టైం గడిపితే వారిలోని అభిరుచులు, అలవాట్లు తెలుసుకునే వీలుంటుంది. ఇదే చేశారు ఎస్‌వీఎస్ కాలనీకి చెందిన కాట్రగడ్డ శేషసాయి, హేమ ప్రభ దంపతులు. తమ ఒక్కగానొక్క కుమార్తె దీక్షను చిన్న వయస్సులోనే క్రికెట్ ఆటలో చేర్పించి మార్గదర్శకులుగా మారారు. అందుకే దీక్ష కేవలం 13 సంవత్సరాల వయస్సులోనే బీసీసీఐ అండర్–15 బాలికల క్రికెట్‌లో సత్తా చాటి ఆంధ్ర జట్టు క్వార్టర్ ఫైనల్స్ చేరడంలో కీలక భూమిక పోషించింది. ఓపెన్ బ్యాటర్‌గానూ, వికెట్ కీపర్‌గానూ రాణించింది.



ఆంధ్ర జట్టు సభ్యులతో కెప్టెన్ దీక్ష

**కన్నవారి ప్రోత్సాహంతో..**

దీక్ష తండ్రి శేషసాయి ఒకప్పుడు క్రికెటర్. దీక్షకూ క్రికెట్‌పై మక్కువ ఏర్పడింది. ఆమెకు ఆట నేర్పడంతో దీక్ష అండర్–13 జిల్లా, జోనల్ క్రికెట్‌లో రాణించింది. గత నెలలో జరిగిన బీసీసీఐ అండర్–15 బాలికల టోర్నీకి ఆంధ్ర జట్టుకు ఎంపికైంది. కెప్టెన్‌గా అవకాశం దక్కింది. ఆ టోర్నీలో ఆంధ్ర జట్టు విజేతగా నిలిచింది. దీంతో నేరుగా ఆంధ్ర జట్టుకు బీసీసీఐ తదుపరి టోర్నీకి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. దీక్ష బ్యాటర్‌గానూ, కీపర్‌గానూ రాణించడంతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. మంగళవారం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దీక్షను అభినందించారు.

### తల్లిదండ్రులే స్ఫూర్తి



నాన్నను చూసి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నా. అమ్మ నాతో మ్యాచ్‌లకు వస్తుంది. నాకు ఏం కావాలన్నా తనే చూసుకుంటుంది. కేవలం నేను క్రికెట్‌ను శ్రద్ధగా ఆడాలని మాత్రమే వారు చెబుతుంటారు. కోచ్‌ల సహకారం కూడా ఎంతో ఉంది. ఏసీఏతోపాటు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాకు అన్ని విధాలుగా సహకరిస్తోంది. ముందు సీనియర్స్ విభాగానికి రావాలి. ఆ తర్వాత నాకంటూ లక్ష్యాలు పెట్టుకుంటా. పేరెంట్స్ సహకారముంటే ఏ క్రీడలోనైనా రాణించవచ్చు.

– దీక్ష

## క్లుప్తంగా

### జాతీయ సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ విద్యార్థులు



**నరసరావుపేట రూరల్:** జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు జొన్నలగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మల్లికార్జునరావు తెలిపారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 30, ఈనెల 1 తేదీలలో తూళ్లూరు మండలం మందడం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలలో పాఠశాల విద్యార్థులు ఎం.బిందు, జేడీ ప్రసన్న కుమార్ పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలలో విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు ఐ.సునీల్, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

### ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్

**సత్తెనపల్లి:** ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్కిల్ హబ్‌లో నిర్వహించనున్న ఉచిత శిక్షణకు అర్హులైన యువత ఈనెల 5లోపు వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి తమ్మాజీరావు కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్– డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సుల్లో 3 నెలలు ట్రైనింగ్ ఉంటుందన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు విద్యానభ్యసించి, 16 నుంచి 40 ఏళ్లలోపు ఉన్న వారు ట్రైనింగ్‌కు అర్హులన్నారు. ట్రైనింగ్ పూర్తయ్యాక స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ రామకృష్ణారెడ్డిని 80743 93466 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలి

**జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు**

**నగరం:** మద్యం షాపు నిర్వాహకులు ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని ఎటువంటి తప్పిదాలు చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని మద్యం షాపు నిర్వాహకులతో సమావేశం నిర్వహిచారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులను నడపాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు.

## వైఎస్సార్‌సీపీ బలోపేతంలో

# జెడ్పీటీసీలదీ కీలక పాత్ర

- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
- పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- కార్యకర్తలు గర్వపడేలా సాగిన వైఎస్ జగన్ పాలన
- పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. పక్కన మేరుగ, బొల్లా, గోపిరెడ్డి, మురళీకృష్ణ, డైమండ్‌బాబు తదితరులు

**పట్నంబజారు:** రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసే ప్రక్రియలో జెడ్పీటీసీలు కీలక పాత్ర పోషించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకమై వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని తీరును ఎండగట్టాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు పార్టీకి కట్టుబడి ఉన్నారని, భవిష్యత్తులో సైతం కూటమి అక్రమాలపై ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

**కార్యకర్తలకు అండగా పార్టీ**

మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి భుజానికెత్తుకున్న జెండాను కిందకు దించకుండా పోరాడుతున్న ప్రతి కార్యకర్త సగర్వంగా తలెత్తుకునేలా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన సాగిందన్నారు. వైఎస్ జగన్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికి ఉన్న అజెండా ఒక్కటేనని.. అది వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం అన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తాము వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు.

**ముఖ్య నాయకులు ఏమన్నారంటే...**

■ వినుకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... పార్టీ ఓటమి చవిచూసిన తరువాత కూడా ఏ మాత్రం వెరువకుండా పార్టీ పటిష్టత కోసం పాటు పడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.

■ నరసరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జెడ్పీటీసీలు రానున్న రోజుల్లో పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, గ్రామ నేతలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు.

■ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజంగానే ఉంటాయని గుర్తుచేశారు. కానీ నమ్ముకున్న సిద్ధాంతాల కోసం, తమకు పదవి ఇచ్చిన నాయకుడి కోసం పోరాడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.

■ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్, పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ.. ఎవరు ఎంత కష్టపడినా ప్రజలకు మంచి చేయటంతోపాటు మన భవిష్యత్తు కోసమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, పార్టీ అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

### నూజెండ్లలో 18.8 మి.మీ వర్షం

**నరసరావుపేట:** ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలోని ఎనిమిది మండలాలు మినహా మిగతా ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లాలో మొత్తం 28 మండలాలు ఉండగా వెల్దుర్తి, మాచవరం, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, పెదకూరపాడు, బొల్లాపల్లి, శావల్యాపురం మినహా మిగతా 20 మండలాల్లో 116.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా చూస్తే నూజెండ్ల మండలంలో అత్యధికంగా 18.8 మి.మీ వర్షం పడగా బెల్లంకొండలో అత్యల్పంగా 0.4 మి.మీ వర్షం కురిసింది. మాచర్లలో 6.0, దుర్గిలో 12.8, రెంటచింతలలో 1.2, గురజాలలో 1.4, దాచేపల్లి 0.8, కారంపూడి 13.4, పిడుగురాళ్ల 5.2, సత్తెనపల్లి 7.4, రాజుపాలెం 4.0, నకరికల్లు 4.4, వినుకొండ 2.8, ఈపూరు 2.6, రొంపిచర్ల 2.0, నరసరావుపేట 3.2, ముప్పాళ్ల 12.4, నాదెండ్ల 4.6, చిలకలూరిపేట 8.6, యడ్లపాడు 4.6 మి.మీటర్ల వర్షం పడింది. కాగా జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో మంగళవారం ఉదయం నుంచి సన్నని జల్లులు తెరలు తెరలుగా పడ్డాయి. వాతావరణం మొత్తం చల్లగా తయారైంది. గత మూడురోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 235.2 మిల్లీమీటర్ల వర్షం పడినట్లు అధికారులు తెలియచేశారు.

## అంతర్రాష్ట్ర నేరగాడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

- తక్కువ సమయంలో కేసు ఛేదించిన పోలీసులు
- వివిధ జిల్లాల్లో చోరీ చేసిన సొత్తు రూ.18.48 లక్షలు రికవరీ
- వివరాలు వెల్లడించిన చీరాల డీఎస్పీ మొయిన్

**అద్దంకి:** అంత రాష్ట్ర దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఇటీవల అద్దంకి పట్టణంలోని పోతురాజు గండిలోని శ్రీసాయిరామ్ ఏజెన్సీస్ దుకాణంలో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చీరాల డీఎస్పీ మొయిన్ విలేకర్ల సమావేశం నిర్వహించి కేసుల వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి సూర్యతేజ చిన్న వయసు నుంచే చిన్న చిన్న దొంగనాలు చేసేవాడు. చెడు వ్యసనాలకు అలవాటుపడి గ్యారేజీల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలు చేస్తుండేవాడు. సూర్యతేజ గుంటూరు నగరంలోని స్వర్ణభారతినగర్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణతో కలసి గత నెల 25వ తేదీ అద్దంకిలోని శ్రీరామ్ ఏజెన్సీలో రాత్రి సమయంలో షట్టర్ పగులగొట్టి గల్లా పెట్టెలో ఉన్న రూ.15.30 లక్షల నగదు చోరీ చేశాడు. దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడిని అతి తక్కువ సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అతి తక్కువ సమయంలో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి అద్దంకితో పాటు వివిధ జిల్లాల్లో 8 కేసులకు సబంధించిన రూ.18.48 లక్షలు సొత్తు రికవరీ చేశారు. మంగళవారం అద్దంకి సమీపంలోని కొంగపాడు డొంక వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

**సిబ్బందికి రివార్డు**

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ మొయిన్, సీసీఎస్ డీఎస్పీ జగదీశ్ నాయక్, అద్దంకి సీఐ కృష్ణయ్య, సీసీఎస్ ఎస్సై ప్రేమయ్య, అద్దంకి ఎస్సై ఖాదర్‌బాషా, చీరాల ఎస్సై కమలాకర్, జే పంగులూరు ఎస్సైతోపాటు వివిధ స్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సై బాజీ, బృందంలోని పోలీసులను ఎస్పీ తుషార్ డూడీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

**పటిష్ట బందోబస్తు**

పట్టణంలో నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో సీసీఎస్ బృందాలతోపాటు పోలీసు బృందాలు గస్తీ తిరుగుతూ అనుమానితుల ఇళ్ల సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించి కొత్త వారు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ కోరారు.

### వైకల్యాన్ని అధిగమించిన వారికి చేయూతనిద్దాం

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి**




**గుంటూరు ఎడ్యుకేషన్:** శారీరక వైకల్యంతో కష్టాలను ఎదుర్కొంటూ వాటిని జయించిన వారికి చేయూత ఇద్దామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ.. అందరికీ స్ఫూర్తినిస్తున్న విభిన్న ప్రతిభావంతులను గౌరవించి, సమాజంలో తోటివారిగా ఆదరించాలని పిలుపునిచ్చారు. గుంటూరు తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నివిధాలా ప్రభుత్వం సాయం చేస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతురాలైన ఉపాధ్యాయురాలు పాదిలి మేరీ రాజేశ్వరిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎంఈవో–2 జ్యోతి కిరణ్, పాఠశాల హెచ్‌ఎం జె.గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు కె.సుజాత, షేక్ ఆసియా భాను, భారతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### 8న పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు

**తెనాలి:** సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8న గుంటూరులో యువతకు పాటలు, ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహించనున్నారు. గుంటూరు కొత్తపేటలోగల మల్లయ్యలింగం భవన్లో ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు ఉంటాయని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు వెల్లడించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన కళాకారుల సమావేశంలో వారు మాట్లాడారు. కళలు, సాహిత్యంపై అభిరుచి కలిగిన యువతరాన్ని ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 18–40 ఏళ్లలోపు వయస్కులు అర్హులుగా తెలిపారు. పాటల విభాగంలో అభ్యుదయ, దేశభక్తి, జానపద గీతాల్లో పోటీలుంటాయని, ఏకపాత్రాభినయంలో సామాజిక స్పృహతో కూడిన వాటికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోని విజేతలకు ఇదే నెల 16, 17వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గురుబ్రహ్మం మాట్లాడుతూ సమాజ చైతన్యానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయని, యువత పాల్గొనాలని కోరారు.

### పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలి




**కొరిటెపాడు(గుంటూరు):** ప్రతి ఖాతాదారుడు తమ బ్యాంక్ పట్ల నమ్మకంగా ఉండి, పెద్ద మొత్తంలో సబ్సిడీ రుణాలు తీసుకొని పరిశ్రమలు పెట్టే స్థాయికి ఎదగాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహిపాల్‌రెడ్డి కోరారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఖాతాదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి బీమా పథకాల గురించి వివరించారు.

## రైస్ మిల్లుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

**వినుకొండ(నూజెండ్ల):** వినుకొండలోని పలు రైస్ మిల్లులపై జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇటీవల కాలంలో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. వినుకొండ రూరల్ మండలం తిమ్మాయపాలెం సమీపంలోని శ్రీవేంకటరమణ రైస్ ట్రేడర్స్, విఠంరాజుపల్లి సమీపంలోని తిరుమల రైస్ ఇండస్ట్రీస్‌లలో అధికారులు తనిఖీలు చేశారు. ఈ మిల్లుల్లో సుమారు 150 టన్నుల బియ్యాన్ని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారులు మాట్లాడుతూ పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమ మార్గాల్లో కొంతమంది అక్రమార్కులు అమ్ముకుంటున్నారని, ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. రైస్ మిల్లుల్లో శాంపిల్స్ సేకరించి టెస్టింగ్‌కు పంపుతున్నామని, పీడీఎస్ రైస్ అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వినుకొండ తహసీల్దార్ సురేష్‌నాయక్, సివిల్ సప్లయ్ డీటీ విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు



కేజీబీవీలో బాలికలతో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

**క్రోసూరు:** ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని డీఈఓ ఎల్.చంద్రకళ చెప్పారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్రోసూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రాన్ని మంగళవారం డీఈఓ సందర్శించారు. ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రత్యేకఅవసరాల పిల్లలను చూసి తల్లిదండ్రులు కుంగిపోకుండా మనోధైర్యంతో ఉండాలని, పిల్లలకు తోడుగా నిలవాలని సూచించారు. అనంతరం ఆటపాటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులను, ఫిజియోథెరపిస్టును అభినందించారు. అనంతరం క్రోసూరులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. అన్ని తరగతుల బాలికలతో మాట్లాడారు. స్టోర్ రూం, వంటగది, పాఠశాల ఆవరణను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 గణేష్, కస్తూరిబా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరాప్రియదర్శి, ఉపాధ్యాయులు, జెడ్పీపాఠశాల హెచ్‌ఎం జి.రామాంజనేయులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### జూనియర్ విభాగం విజేత హైదరాబాద్ ఆర్ఆర్ బుల్స్ ఎడ్ల జత

**కారెంపూడి:** పల్నాటి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఎడ్ల పోటీలలో భాగంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీలలో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ బుల్స్ డి.రోషన్ బాబు ఎడ్ల జతలు ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్ చౌదరి, శివకృష్ణ చౌదరి, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం బురుజుపల్లెకు చెందిన యరమల మోక్ష అధిరన్‌రెడ్డిల కంబైన్డ్ ఎడ్ల జతలు తృతీయ స్థానం సాధించాయి. నాలుగో బహుమతిని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా పల్కందొడ్డికి చెందిన కాజా హుస్సేన్ ఎడ్ల జత, ఐదో బహుమతిని బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్ చౌదరి ఎడ్ల జత, ఆరో బహుమతిని గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత కైవసం చేసుకున్నాయి. పోటీలో మొత్తం పది జతలు పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులను శ్రీచక్ర సిమెంట్స్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్, వెన్నపూసల రాంబాబు, గోళ్ల సురేష్ యాదవ్, మిర్యాల వెంకటేశ్వర్లు, నాగెండ్ల రామారావు ప్రదానం చేశారు. కమిటీ సభ్యులు బొమ్మిన శ్రీను. బొమ్మిన శేషగిరిరావు, నాగారపు రామకృష్ణ, పలిశెట్టి హనుమంతరావు, పలిశెట్టి శ్రీను. చింతపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. బుధవారం సీనియర్స్ విభాగంలో పోటీలతో ఎడ్ల పోటీలు ముగియనున్నాయి. సీనియర్స్ విభాగంలో ప్రైజ్ మనీ భారీగా పెంచినట్టు రైతు సంఘం ప్రతినిధులు పలిశెట్టి కోటేశ్వరరావు, బొమ్మిన కొండ తెలిపారు.

### ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్**



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

**రేపల్లె రూరల్:** మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో పలు ఇంజినీరింగ్ విభాగాలలో సుమారు 13వేల మంది కార్మికులు 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరికి 2018 సంవత్సరం వరకు పారిశుద్ధ్య కార్మికులతోపాటు సమానంగా జీతాలు చెల్లించారని, ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు, సకాలంలో అందించాలని, వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై నెట్టివేసే ధోరణి మారాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించినప్పుడు టీఏ, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎన్.రవిబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు, రమేష్, శ్రీనివాస్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ ప్రొఫెసర్‌కు సైబర్ వల

- రూ.74 లక్షలు మాయం
- పోలీసులకు ఫిర్యాదు

**చుండూరు(వేమూరు):** చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ గొంది లక్ష్మీహరివరప్రసాద్‌ను సైబర్ నేరస్తులు మోసం చేసి వారి అకౌంట్‌లో రూ.74 లక్షలు జమ చేయించుకున్నట్లు ఎస్‌ఐ షేక్ రహమాన్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు..చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన గొంది లక్ష్మీహరి వరప్రసాద్ కేరళ రాష్ట్రంలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. రిటైర్ అయిన తర్వాత స్వగ్రామైన వేటపాలెంలో నివాసం ఉంటున్నాడు. సైబర్ నేరస్తులు ఫోన్ చేసి మీ అకౌంట్‌లో రూ.6 కోట్లు జమ అయ్యాయని, మనీ లాండరింగ్ కింద కేసు నమోదైందని, సుప్రీంకోర్టులో కేసు ఉంది, కేసు మాఫీ చేయాలంటే మా అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని కోరారు. దీంతో ఆయన భయపడి వారి అకౌంట్‌కు రూ.74 లక్షలు పంపించాడు. మరలా ఫోన్ చేసిన రూ.30 లక్షలు అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. అనుమానం రావడంతో ఆయన విదేశాలలో ఉంటున్న తన కుమార్తెకు విషయం తెలియజేశాడు. వెంటనే కేసు పెట్టాలని ఆమె సూచించడంతో చుండూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సైబర్ నేరస్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ షేక్ రహిమాన్ తెలిపారు.

## కంకర కుప్పను ఢీకొని యువకుడి మృతి

ఒకరికి తీవ్రగాయాలు, మరో ఇద్దరికి స్వల్పగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

**వేటపాలెం:** రోడ్డుకు అడ్డుగా పోసిన కంకర కుప్పను బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం దగ్గరలోని క్రిస్టల్ విల్లాస్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన నలుగురు యువకులు రెండు బైకలపై పొట్టి సుబ్బయ్యపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో వేగంగా వస్తున్న బైక్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డుపై ఉన్న కంకర కుప్పను ఢీకొంది. బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఇందులో యర్రవరపు కల్యాణ్‌రామ్ (20) అక్కడికక్కడే మృత్యువాత పడగా, కంచర్ల వెంకట మనోజ్ తీవ్రగాయాల పాలయ్యాడు. వీరి వెంటే వస్తున్న మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై భవన నిర్మాణ మెటీరియల్ వేయడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవాహనాలకు ప్రమాదకరంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో భవన నిర్మాణ మెటీరియల్‌ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### జాతీయస్థాయిలో కర్లపాలెం కానిస్టేబుల్ ప్రతిభ

- పెన్‌కాక్ సిలాట్‌లో కాంస్య పతకం
- కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ



కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను మెడల్స్‌తో అభినందిస్తున్న ఎస్పీ

**బాపట్లటౌన్:** క్రీడలు శరీర సౌష్టవంతోపాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శ్రీనగర్‌లోని ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నవంబర్ 19 నుంచి 21 వ తేదీ వరకు జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పోటీల్లో వివిధ విభాగాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే వీరంకి నరేంద్ర పెన్ కాక్ సిలాట్ ఎబోవ్ 110 విభాగంలో పోటీ పడి కాంస్య పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయిలో జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని చాటిన నరేంద్రను మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఐపీఎస్ అభినందించి మెడల్‌తో సత్కరించి మెమెంటోను తన చేతులమీదుగా అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు.